# ఆటోవాలా.. బతుకు డీలా

- పెరిగిన ఖర్చులతో జీవనస్థితి కుదేలు
- ఎన్నికల హామీని నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- ఏటా రూ.15 వేలు ఇస్తామని వాగ్దానం
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం


ఆటో స్టాండ్‌లో నిలిచిన ఆటోలు

**పొన్నూరు:** ఆటో డ్రైవర్ల జీవనస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒక పక్క ఉచిత బస్సు, మరోపక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ పెట్రోలు, డీజిల్ ధరలు పెంచుతుండడంతో వారికి తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర రూ.98 వరకూ ఉంది. పెరిగిన ఖర్చులు.. బాడుగలు లేక ఆటోలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మికులు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణ, మండల పరిధిలో వందల సంఖ్యలో ఆటోలు ఉన్నాయి. బస్సులు లేనప్పుడు ఆటోలపైనే ఆధారపడి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. పొన్నూరులో ఆర్టీసీ బస్సులు లేని గ్రామాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. వాటికి ఆటోలే ఆధారం.

### ప్రభుత్వ నిర్లక్ష్యం..

కష్టాల్లో ఉన్న ఆటో కార్మికులను ఆదుకునే విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆటో కార్మికులు విమర్శిస్తున్నారు. ఆటో కార్మికులకు ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టో ద్వారా కూడా ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా హామీ అమలు చేయడంలేదని ఆటో కార్మికులు మండిపడుతున్నారు.

### పెరిగిన ఖర్చులు..

ఆటో నిర్వహణకు సాధారణంగా అనేక ఖర్చులు ఉంటాయి. అయితే పెరిగిన డీజిల్ ధరలతో ఆటో కార్మికుడికి రోజంతా కష్టపడితే కనీసం రూ.200 నుంచి రూ.300 కూడా మిగలని పరిస్థితి నెలకొంది. ఏటా ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.15 వేలు వరకు ఖర్చు అవుతోంది. దీంతో పాటు తనిఖీల పేరుతో పోలీసులు, రవాణాశాఖ అధికారులు దాడులు చేసి రూ.వేలల్లో జరిమానాలు విధిస్తున్నారు. ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకు నెలవారీ ఇన్‌స్టాల్ మెంట్లు కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దిన దిన భారంగా మారిపోయాయి. వచ్చే అరకొర డబ్బులు ఇంధనం, ఇతర ఖర్చులకే సరిపోతున్నాయని ఆటో కార్మికులు వాపోతున్నారు.

### గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భరోసా..

ఎన్నికల హామీ మేరకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్ కేటాయించారు. అర్హులైన ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో గత ప్రభుత్వం జమ చేసింది. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా వర్తింప చేసింది.

### ఇచ్చిన హామీని అమలు చేయాలి..



ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15వ తేదీన ఆటో కార్మిక సంఘం, ఏఐటీయూసీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. రోజంతా కష్టపడి ఆటో నడిపే కార్మికుల కుటుంబ పోషణ భారంగా మారాయి. నిత్యావసర సరుకులతో పాటు ఇంధన ధరలు పెరగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇవ్వాలి.

-ఆరేటి రామారావు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు, పొన్నూరు

## క్లుప్తంగా

### ఘనంగా వినాయక నిమజ్జనం



**చేబ్రోలు:** చేబ్రోలు మండలంలో ఆదివారం వినాయక విగ్రహాల నిమజ్జనాలు కోలాహలంగా జరిగాయి. వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాల ఊరేగింపుగా చేబ్రోలులోని నిమజ్జన కేంద్రాలకు విగ్రహాలను భక్తులు తరలించారు. చేబ్రోలు, గుంటూరు, పొన్నూరు, తెనాలి తదితర ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలు నిమజ్జన కేంద్రాలకు తరలివచ్చాయి. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా కొమ్మమూరు ఛానల్ వద్ద నిమజ్జన కేంద్రానికి తరలించారు. చేబ్రోలులోని కొమ్మమూరు ఛానల్ నిమజ్జన కేంద్రం, సంగం జాగర్లమూడి నిమజ్జన కేంద్రాల వద్ద వందలాది విగ్రహాలను నిమజ్జనం చేశారు.

### బాజీబాబా దర్గా అభివృద్ధికి కృషి



**పెదకాకాని:** బాజీబాబా దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణ అధికారి మహమ్మద్ అలీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆదేశాల మేరకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణ అధికారి మహమ్మద్ అలీ ఆదివారం పెదకాకాని బాజీబాబా దర్గాను సందర్శించారు. దర్గాకు విచ్చేసిన వక్ఫ్ బోర్డు సీఈవో మహమ్మద్ అలీకి దర్గా ఈవో షేక్ ఖాజామస్తాన్, సిబ్బంది స్వాగతం పలికారు. ముందుగా దర్గాలో ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా పరిసరాలను పరిశీలించి దర్గాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. దర్గాలో జరుగుతున్న నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో దర్గా ఈవో షేక్ ఖాజామస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

### విశ్వనాథ సాహిత్యం యువతకు ప్రేరణ కావాలి



**నగరంపాలెం:** కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యం యువతకు ప్రేరణ కావాలని వీవీఐటీ విద్యా సంస్థల ఛాన్స్‌లర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. వివిఐటి విశ్వవిద్యాలయం, విశ్వనాథ సాహిత్య అకాడమీ సంయుక్తంగా ఆదివారం లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో విశ్వనాథ పదంలో యువత దృక్పథం పత్ర సమర్పణ సదస్సు నిర్వహించారు. విశ్వనాథ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ మద్దినేని సింహకొటిల్యచౌదరి సదస్సుకి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణలో తరచూ సగటు జీవి వేదన కనిపిస్తోందని అన్నారు. అధ్యక్షత వహించిన డాక్టర్ మద్దినేని సింహకొటిల్యచౌదరి మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యం పునర్జీవానికి కవి సామ్రాట్ సత్యనారాయణ తనదైన శైలిలో బాటలు వేశారని అన్నారు. చారిత్రక నవలల సదస్సుకు డాక్టర్ అబ్బరాజు మైథిలి అధ్యక్షత వహించారు. సాంఘిక నవలల సదస్సుకు వీబీ హేలిక క్యాబ్ అధ్యక్షత వహించారు. ముగింపు సభలో విశ్వనాథ పథంలో యువత గ్రంథావిష్కరణను వాసిరెడ్డి విద్యాసాగర్ చేశారు. యువ రచయితలను ప్రశంస పత్రాలతో సత్కరించారు. సదస్సులో కవి సామ్రాట్ మనవడు విశ్వనాథ సత్యనారాయణ, అకాడమీ సభ్యులు పిన్నమనేని మృత్యుంజయరావు, రావెల సాంబశివరావు, మోదుగుల రవికృష్ణ, కోశాధికారి డాక్టర్ సెట్లం చంద్రమోహన్ పాల్గొన్నారు.

### పోలీస్ వాహనంలో క్షతగాత్రుల తరలింపు

**నగరంపాలెం:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పోలీస్ వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. పాత గుంటూరు పీఎస్ ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్ ఆదివారం రాత్రి విధులు నిమిత్తం గుంటూరు తక్కెళ్లపాడు బైపాస్ వైపు పోలీస్ వాహనంలో వెళ్లారు. అదే సమయంలో ద్విచక్ర వాహనాన్ని టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురికి గాయాలై, రోడ్డుపై పడిపోయారు. అప్పటికే స్థానికులు 108 కు ఫోన్ చేయగా స్పందించలేదు. ఎస్ఐ ప్రసాద్ వెంటనే క్షతగాత్రులను వైద్యసేవలు నిమిత్తం పోలీస్ వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. బాధితులు అత్యవసర సేవల చికిత్సా విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలంలో టాటా మ్యాజిక్ వాహనాన్ని వదిలి డ్రైవర్ పరారయ్యాడు.

### మరణాలకు కారణం నీటి కాలుష్యమే



**గుంటూరు రూరల్:** తురకపాలెం గ్రామంలో వరుస మరణాలకు ప్రధాన కారణం నీటి కాలుష్యమేనని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం నాయకులు ఆరోపించారు. ఆదివారం సంఘం నేతలు గ్రామంలో పర్యటించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి జరిగిన సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తురకపాలెంలో వరుస మరణాలకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కేవలం ప్రభుత్వ వైఫల్యం కారణంగానే మరణాలు సంభవించాయని వాపోయారు. ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించాయన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, గ్రామ ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నిజనిర్ధారణ కమిటీ సభ్యులు రాష్ట్ర అధ్యక్షుడు వి.చిట్టిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ టి.రాజారావు, కమిటీ సభ్యులు పి.రాజారావు, జిల్లా కార్యదర్శి సి.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వీరేశలింగం, జిల్లా ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ జి.గోపినాథ్, సభ్యుడు షేక్ నాగుర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసరాలకు నీళ్లు కరువు!


గ్రామంలో నీటి సరఫరాను నిలిపేసిన వాటర్ ట్యాంక్

**గుంటూరు రూరల్:** వరుస మరణాలతో బెంబేలెత్తిన తురకపాలెం గ్రామ ప్రజలు నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. ఎవ్వరూ గ్రామంలో నీటిని తాగొద్దని చెప్పిన అధికారులు ఇంటింటికి మినరల్ వాటర్ సరఫరా చేస్తామన్నారు. అదేవిధంగా గ్రామంలో రెండు మూడుచోట్ల నీటి ట్యాంక్‌లను ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామ ప్రజలు అక్కడికి వెళ్లి నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. ఇది ఇలా ఉంటే.. ప్రతి రోజు వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటి కుళాయిలకు నీటిని సరఫరా చేసే పంచాయతీ అధికారులు గడిచిన వారం రోజులుగా నీటిని సరఫరా చేయడం నిలిపివేశారు. నీటిలో బ్యాక్టీరియా ఉందనే అనుమానంతో ప్రజలు ఇళ్లలోని బోరు నీటిని వినియోగించుకునేందుకు భయాందోళన చెందుతున్నారు.

**ట్యాంకుల ద్వారా అరకొర సరఫరా..**

నీటి ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేయడం నిలిపివేసిన పంచాయతీ అధికారులు ప్రజల నిత్యావసరాలకు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీళ్లు అందరికీ అందడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ప్రజలు ఇళ్లలో ఉండే సమయాల్లో కాకుండా వారికి కుదిరిన సమయంలో నీటిని సరఫరా చేస్తుండటంతో పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికి నిత్యావసరాల నీరు కరువవుతోంది. ప్రజలకు ప్రతి ఇంటికి నీటిని సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అలానే గ్రామంలోని తూర్పు బజారుకు భోజనాల వసతి ఏర్పాటు చేయలేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు.

### చలపతి ఫార్మసీలో ఏఎన్‌యూ క్రీడల జోనల్ కమిటీ సమావేశం

**గుంటూరు రూరల్:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఏటా నిర్వహించే అంతర్ కళాశాల క్రీడా పోటీలు విద్యార్థుల శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంలో, క్రీడాస్ఫూర్తిని పెంచడంలో, అలానే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభను ప్రదర్శించే వేదికగా నిలుస్తున్నాయని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఆదివారం నగర శివారుల్లోని లాం లోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన కంబైన్ జోనల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం సెప్టెంబరు 9వ తేదీ ఉదయం 10 గంటలకు చలపతి ఫార్మసీ కళాశాల, లాం ప్రాంగణంలో జరగనుందని తెలిపారు. సమావేశానికి గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని విశ్వవిద్యాలయానికి అనుబంధితమైన డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు ప్రత్యేక ఆహ్వానం అందుకున్నారన్నారు. విద్యతో పాటు క్రీడలు సమాన ప్రాముఖ్యత కలిగినవని సమావేశం నిర్వాహకులు భావించారు. రానున్న రోజుల్లో ఈ సమావేశం ద్వారా తీసుకోనున్న నిర్ణయాలు, విద్యార్థుల క్రీడా రంగ భవిష్యత్తు దిశను నిర్ధారించనున్నాయని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి

**అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కుమారి**


సమావేశంలో మాట్లాడుతున్న కుమారి

**ప్రత్తిపాడు:** సమ్మె కాలపు ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని.. లేకుంటే ఐక్య పోరాటాలకు సిద్ధమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని అక్షయ విద్యాలయంలో ఆదివారం ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్–హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రాజెక్టు మహాసభను నిర్వహించారు. సభకు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.రమణ, అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారిలు హాజరయ్యారు. పి.ప్రేమలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో కుమారి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు 42 రోజుల పాటు సమస్యల పరిష్కారం కోసం పోరాడారన్నారు. సమ్మె కాలంలో ఇచ్చిన ఒప్పందాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు తల్లికి వందనం, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్, వితంతు పింఛన్ వంటి పథకాల అమలు ఇంకా జరగకపోవడం బాధాకరమన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక..**

మహాసభలో ఆదివారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రాజెక్టు అధ్యక్షురాలిగా కె.పద్మ (చమళ్లమూడి), కార్యదర్శిగా పి.ప్రేమలత (పొండ్రపాడు), కోశాధికారిగా నగరాజకుమారి (ప్రత్తిపాడు), ఉపాధ్యక్షులుగా సుభాషిణి, శివ పార్వతి, ధనలక్ష్మి, శ్రీ వాసవి, నవరత్నమణి, సహాయ కార్యదర్శులుగా విజయ, శశికళ, శ్రీదేవి, నవనీతం, స్వాతిలతో పాటు మరో పదిహేను మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

# కార్యకర్తల కుటుంబాలకు బలసాని పరామర్శ


రెడ్డిపాలెంలో సాంబిరెడ్డి పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న బలసాని

**గుంటూరు రూరల్:** ప్రతి కార్యకర్త కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం గోరంట్ల గ్రామంలోని మేరీప్రియా నగర్ కాలనీలో ఇటీవల అకాల మృత్యువాతకు గురైన మున్నంగి ప్రదీప్ కుటుంబాన్ని బలసాని పరామర్శించారు. ప్రదీప్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ మండలం, గోరంట్ల గ్రామ, మేరీప్రియా నగర్ కాలనీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

**రెడ్డిపాలెం గ్రామంలో..**

రెడ్డిపాలెం గ్రామంలో డివిజన్ ఇన్‌చార్జి లంకిరెడ్డి మనోహర్‌రెడ్డి తండ్రి లంకిరెడ్డి సాంబిరెడ్డి అకాల మృత్యువాతకు గురవ్వడంతో విషయం తెలుసుకున్న బలసాని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. సాంబిరెడ్డి భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డిపాలెం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎముకల సాంద్రత నిలుపుకోవడం కీలకం

**లక్ష్మీపురం:** ఎముకల ఆరోగ్యాన్ని, సాంద్రతను నిలుపుకోవడానికి పౌష్టికాహారం, తేలికపాటి వ్యాయామాలు ఉపయోగపడతాయని సీనియర్ ఆర్థోపెడిక్ నిపుణులు కొల్లి జయ కిషన్ అన్నారు. ఆదివారం గుంటూరు అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎముకలు, కీలు, కండరాలు వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో చాలా మందిని ఇబ్బందిపెట్టే వ్యాధి ఆస్టియో పోరోసిస్ అని, ఈ వ్యాధిలో బోన్ మినరల్ డెన్సిటీ తగ్గిపోతుందని దీంతో చిన్న దెబ్బలకే ఎముకలు విరిగిపోతాయన్నారు. కొంత మందికి వెన్నెముక, పక్కటెముకలకు ఆస్టియో పోరోసిస్ రావటం వలన సైలెంట్‌గా ఫ్రాక్చర్ అవుతాయన్నారు. నడుం నొప్పి అనిపించడం, నరాలు మొద్దుబారటం, కండరాలు క్షీణించటం లాంటి బాధలు ఆస్టియో పోరోసిస్ వ్యాధిలో ఎక్కువగా వస్తుంటాయని వివరించారు. ఈ వ్యాధి వచ్చిన తరువాత చికిత్స కంటే రాకుండా జాగ్రత్త పడటం ముఖ్యమన్నారు. ఆహారంలో కాల్షియం, విటమిన్–డి ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ జయ కిషన్‌ను అవగాహన సంస్థ సభ్యులు సత్కరించారు. సభకు ఆరోగ్య సభ కో–ఆర్డినేటర్ టి.వి.సాయిరాం సమన్వయం చేయగా.. సభలో విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఆర్.రామ చంద్రరావు, అనవేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి ప్రసంగించారు.

# రైతులకు బాసటగా వైఎస్సార్ సీపీ


పోస్టర్లును ఆవిష్కరిస్తున్న చల్లా హనుమంత్ యాదవ్

**ప్రత్తిపాడు:** రైతుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చల్లా హనుమంత్ యాదవ్ అన్నారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతులకు బాసటగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ ఈనెల 9వ తేదీన అన్నదాత పోరు కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పాతమల్లాయపాలెం సెంటరులో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంస్య విగ్రహం ఎదుట పార్టీ నాయకులు అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు చల్లా హనుమంత్ యాదవ్ స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోస్టర్లును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడంలో అలసత్వం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగిరెడ్డి పరమారెడ్డి, బాపతు వెంకటేశ్వరెడ్డి, మూలె శ్రీనివాసరెడ్డి, గుజ్జుల శివారెడ్డి, వాడపల్లి ఫ్రాన్సిస్, గండు నాగరాజు, బాపతు గోవింద్‌రెడ్డి, మన్నవ మహేంద్ర, అనిల్, జె.పరమేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**ఈనెల 18న చలో విజయవాడ**


సమావేశంలో మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ

**పెదకాకాని:** రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం వెనిగండ్ల శివారులో ఆటో కార్మికుల రౌండ్ టేబుల్ సమావేశం సీఐటీయూ మండల అధ్యక్షులు కె.ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిందన్నారు. ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని.. వాహన మిత్ర కింద రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 18వ తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజా రమేష్, బుల్లా యాకోబు, దంటు వెంకటరెడ్డి, షేక్ ఇస్మాయిల్, టి.సాంబయ్య, షేక్ బికారిసాహెబ్, యు.దుర్గారావు, పి.లింగయ్య, ఎల్.అప్పారావు, ఎం.శ్రీధర్, కుమార్ నాయక్, దుర్గాప్రసాద్, స్వామినాయక్, గోపికృష్ణ నాయక్, కె.శ్రీనునాయక్, కోటేశ్వర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు



**లక్ష్మీపురం:** వ్యక్తి అదృశ్యంపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. సీతమ్మ కాలనీ ప్రాంతానికి చెందిన వేముల రామాంజనేయులు, శివపార్వతికి ఇద్దరు సంతానం. రామాంజనేయులు ట్రాక్టర్ డ్రైవర్. శనివారం సాయంత్రం 4 గంటలకు ఫోన్ మాట్లాడుకుంటూ హడావుడిగా బయటకు వెళ్ళాడు. తిరిగి భార్య ఫోన్ చేయగా పని మీద బయటకు వచ్చానని తిరిగి వస్తానని చెప్పాడు. మళ్లీ ఒక గంట తరువాత ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో చుట్టు పక్కల, బంధు మిత్రుల ఇళ్ల వద్ద విచారించగా ఎంతకు జాడ తెలియక పోవడంతో భార్య శివపార్వతి అరండల్‌పేట పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు చేసింది. ఆచూకి తెలిస్తే నగరంపాలెం పోలీస్ స్టేషన్ 0863–2234047, సీఐ నజీర్ బేగ్ 8688831336 నంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

# వృద్ధులు, వితంతువులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

**ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ నాయకుడు ముప్పాళ్ల లేఖ**



**లక్ష్మీపురం:** అక్టోబర్ ఒకటిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో వృద్ధుల, వితంతువుల, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆదివారం లేఖ రాశారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో 13 శాతంపైగా 60 సంవత్సరాలు పైబడిన వారు ఉన్నారని చెప్పారు. వీరుగాక తీవ్ర అనారోగ్య సమస్యలతో తమ ప్రభుత్వం అందిస్తున్న రూ.15 వేలు నెలసరి పెన్షన్ పొందుతున్న వారితో పాటు విభిన్న ప్రతిభావంతులు, వితంతువులు సుమారు 80 లక్షలకు పైగా పలు ఇబ్బందులతో తమ జీవితాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పెన్షన్ నిబంధనలు సడలించి అర్హత కలిగిన వయస్సు ఉన్న భార్యాభర్తలు ఇరువురు జీవించి ఉన్న కుటుంబాలలో ఇరువురికి పెన్షన్ మంజూరు చేసి న్యాయం చేకూర్చమని కోరారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వపరంగా వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేయాలని, ఔత్సాహికులు ఏర్పాటుచేసిన వృద్ధాశ్రమాలకు తగిన గ్రాంట్లు, ప్రోత్సాహాలను అందించాలని తెలిపారు.

### ముగిసిన శ్రీనారాయణదాస జయంత్యుత్సవాలు



**నగరంపాలెం:** స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న శ్రీనారాయణదాస జయంత్యుత్సవాలు ముగిశాయి. శ్రీఆదిభట్ల నారాయణదాస కథాగాన కళా పరిషత్ ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ కమిటీ, సంస్థ నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ఆదివారం ప్రారంభించారు. సప్పా భారతి భాగవతారిని భక్త అంబరీష హరికథాగానం చేయగా, ప్రేక్షకులను అలరించింది. మృదంగంపై జగన్మోహిని, వయోలిన్‌పై చావలి శ్రీనివాస్ వాయిద్యాన్ని అందించారు.